


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 04-03-2023 సంపుటి : 04 సంచిక : 166 పేజీలు : 4 వెల : రూ 3-00


## ఏపీలో అదానీ సిమెంట్ ప్లాంట్స్.. అంబానీ సోలార్ ప్రాజెక్ట్



విశాఖపట్నం: ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు బడా పారిశ్రామికవేత్తలైన అంబానీ, అదానీ ముందుకొచ్చారు. ఏపీలో తాము సిమెంట్ ఫ్యాక్టరీలు, డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని అదానీ గ్రూప్ ప్రకటించగా.సోలార్ ఎనర్జీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ముకేశ్ అంబానీ ప్రకటించారు. విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు ఇందుకు వేదికైంది. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో భాగంగా తొలి రోజు ఈ ప్రకటనలు వెలువడ్డాయి.ఆంధ్రప్రదేశ్‌లో రెండు సిమెంట్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయనున్నట్లు అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ సీఈఓ, గౌతమ్ అదానీ తనయుడు కరణ్ అదానీ ప్రకటించారు. 10 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో కడప, నడికుడిలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. విశాఖలో 400 ఓచి డేటా సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఏపీలో 100 మిలియన్ టన్నుల సామర్థ్యంతో కృష్ణపట్నం, గంగవరం పోర్టులు నిర్వహిస్తున్నామని, రాబోయే ఐదేళ్లలో ఈ సామర్థ్యాన్ని రెట్టింపు చేయడంతో పాటు, ఈ పోర్టులను ఇండస్ట్రియల్ పోర్ట్ సిటీస్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లలో అనంతపురం, కడప, కర్నూలు, విశాఖపట్నం, విజయనగరంలో 15వేల మెగావాట్ల పునరుత్పాదక పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదానీ ఫౌండేషన్ సేవలను ఏపీకి విస్తరించనున్నట్లు తెలిపారు.ఏపీలో 10 గిగావాట్ల సామర్థ్యంతో సోలార్ ఎనర్జీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ ప్రకటించారు. పెట్టుబడిదారుల సదస్సుకు స్వయంగా హాజరైన ఆయన.. ఈ మేరకు దీని గురించి ప్రకటన చేశారు. ఇప్పటికే ఏపీలో కేజీ డి-6 బేసిన్‌లో రూ.1.50 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టినట్లు గుర్తుచేశారు. ఇక్కడి బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువు 30 శాతం మేర దేశీయ అవసరాలను తీరుస్తోందని చెప్పారు. భారత అభివృద్ధిలో ఏపీ ఎంత ముఖ్యమో చెప్పేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలన్నారు. 2023 చివరి నాటికి దేశవ్యాప్తంగా జియో ట్రూ 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

## విశాఖ నుంచే పరిపాలన చేయబోతున్నా: సీఎం జగన్




విశాఖ: దేశ ప్రగతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో కీలకంగా మారిందని ఏపీ సీఎం వైఎస్ జగన్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని.. దాదాపు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు రాష్ట్రం వేదిక కానుందని అన్నారు. విశాఖ వేదికగా జరుగుతున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్)లో జగన్ మాట్లాడారు."రాష్ట్రంలో 20 కీలక రంగాల్లో 6 లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు అవకాశాలున్నాయి. సదస్సు మొదటి రోజు వివిధ సంస్థలతో 92 ఒప్పందాలు (ఎంవోయూ) జరిగాయి. 340 సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. రాష్ట్రంలో 6 పోర్టులు ఉన్నాయి.. మరో 4 పోర్టులు రాబోతున్నాయి. పోర్టులకు సమీపంలో పుష్కలంగా భూములున్నాయి. నైపుణ్యం కలిగిన యువతకు ఏపీలో కొదవ లేదు" అని సీఎం తెలిపారు.ఈ సందర్భంగా విశాఖ పరిపాలన రాజధాని అవుతుందని జగన్ మరోసారి స్పష్టం చేశారు. "రాష్ట్రం నుంచి ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో మూడు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయి. భౌగోళికంగా పరిశ్రమలకు ఏపీ అనుకూలం. రాష్ట్రంలో సులువైన పారిశ్రామిక విధానం ఉంది. ఏపీలో క్రియాశీలక ప్రభుత్వం ఉంది. విశాఖ త్వరలో పరిపాలన రాజధాని కాబోతోంది. నేను కూడా విశాఖ నుంచే పాలన చేయబోతున్నాను. త్వరలోనే ఇది సాకారం అవుతుంది" అని సీఎం జగన్ వెల్లడించారు.

## విశాఖలో ప్రారంభమైన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్



విశాఖ: విశాఖ వేదికగా ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు (గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్) ప్రారంభమైంది. ఏపీ సీఎం వైఎస్ జగన్ సదస్సును ప్రారంభించారు.నేటి నుంచి రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. ఎడ్వాంటేజ్ ఏపీ నినాదంతో 14 రంగాల్లో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. పలువురు కేంద్ర మంత్రులు, పారిశ్రామికవేత్తలు, వివిధ దేశాల రాయబారులు, వాణిజ్య ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ, జీఎంఆర్ గ్రూపు అధినేత జి.మల్లికార్జునరావు, సయంట్ అధినేత మోహన్‌రెడ్డి, అదానీ పోర్ట్స్ సీఈవో కరణ్ అదానీ, ఆదిత్య బిర్లా గ్రూపు ఛైర్మన్ కుమారమంగళం బిర్లా, టాటా గ్రూపు ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎల్ల, ఎండీ సుచిత్ర ఎల్ల సదస్సుకు హాజరయ్యారు.ఇవాళ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు చర్చాగోష్ఠులు జరగనున్నాయి. వివిధ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై వీరు చర్చించనున్నారు. సాయంత్రం 6 గంటలకు బీచ్‌రోడ్డులోని ఎంజీఎం మైదానంలో అతిథులకు రాష్ట్ర ప్రభుత్వం విందు ఏర్పాటు చేసింది. రేపు ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకోనున్నారు. రేపు మధ్యాహ్నం 2 గంటలకు సదస్సు ముగియనుంది."సీఎం జగన్ నాయకత్వంలో పారిశ్రామికంగా ఏపీ అభివృద్ధి చెందుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో సత్వరమే పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తాం. రాష్ట్రంలో అపార ఖనిజ సంపద ఉంది. పెట్టుబడులకు అవకాశాలు అపారం. పారిశ్రామికంగా అనుకూల అవకాశాలున్నాయి"
- ఏపీ ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్

## ఈనెల 14 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం




అమరావతి: ఏపీలో ఈ నెల 14వ తేదీ నుంచి అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు.మార్చి 14న ఉదయం 10 గంటల నుంచి ఉభయసభలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మరోవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి సంబంధించి ఉభయ సభలనూ ఉద్దేశించి 10 గంటలకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు.

## హోంగార్డులను ప్రత్యేక కేటగిరిగా పరిగణించండి

### పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశం

అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రక్రియకు సంబంధించి హైకోర్టు బుధవారం కీలక ఆదేశాలు ఇచ్చింది.హోంగార్డులను ప్రత్యేక కేటగిరిగా పరిగణించి.. ప్రిలిమ్స్ మెరిట్ ఆధారంగా దేహదారుఢ్య పరీక్షకు అనుమతించాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి, రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్, డీజీపీ తదితరులకు నోటీసులు జారీ చేసింది.ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో తమను ప్రత్యేక కేటగిరిగా పరిగణించలేదంటూ గుంటూరు జిల్లాకు చెందిన హోంగార్డులు చింతా గోపీ, మరో ముగ్గురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది జి.శీనాకుమార్ వాదనలు వినిపిస్తూ.. సాధారణ అభ్యర్థులకు నిర్దేశించినట్లు హోంగార్డులకు కూడా కటాఫ్ మార్కులు నిర్ణయించడం తగదని.. ఇది గతంలో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధమన్నారు.ప్రిలిమ్స్‌లో అర్హత మార్కులు సాధించలేదన్న కారణంతో పిటిషనర్లను దేహదారుఢ్య పరీక్షకు అనుమతించలేదని తెలిపారు. మొత్తం పోస్టుల్లో హోంగార్డులకు ప్రత్యేకంగా 15 శాతం కోటా ఉందని చెప్పారు. 2016 నాటి జీవో 97 ప్రకారం స్టేట్ అండ్ సబార్డినేట్ రూల్స్ ప్రత్యేక కేటగిరికి వర్తించని తెలిపారు. సాధారణ అభ్యర్థుల్లాగా ప్రిలిమ్స్‌లో కటాఫ్ మార్కులు నిర్ణయించడంతో పిటిషనర్లు దేహదారుఢ్య పరీక్షకు అర్హత కోల్పోవాల్సి వచ్చిందని శీనాకుమార్ వివరించారు.



## 'కేంద్రం నుంచి ఏపీకి సంపూర్ణ సహకారం..

### రోడ్ కనెక్టివిటీ పెంచేందుకు రూ.20వేల కోట్లు..'

విశాఖపట్నం: వైజాగ్‌లో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రసంగించారు. ఏపీ పారిశ్రామిక వృద్ధిలో రోడ్ కనెక్టివిటీ కీలకమని పేర్కొన్నారు.పోర్టులతో రహదారుల కనెక్టివిటీని బలోపేతం చేస్తామని చెప్పారు.పరిశ్రమలకు లాజిస్టిక్స్ ఖర్చు తగ్గించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఏపీలో మూడు పారిశ్రామిక కారిడార్లు వస్తున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో రోడ్ కనెక్టివిటీని పెంచేందుకు రూ.20వేల కోట్లు కేటాయిస్తామని గడ్కరీ తెలిపారు.అలాగే ఏపీలో మత్స్య పరిశ్రమ చాలా కీలకంగా మారిందని గడ్కరీ పేర్కొన్నారు. రాష్ట్రంలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుకు సిద్ధమని ప్రకటించారు. 50-50 భాగస్వామ్యంతో లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఈ మార్కెట్ రోజురోజుకు విస్తరిస్తోందని వివరించారు.



పర్యావరణహిత వాహనాలదే భవిష్యత్ అని స్పష్టంచేశారు. కాలుష్యాన్ని తగ్గించడం చాలా ముఖ్యమని సూచించారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీకి రాయితీలు ఇస్తున్నట్లు గుర్తుచేశారు.కేంద్రం నుంచి ఏపీకీ సంపూర్ణ సహకారం ఉంటుందని గడ్కరీ చెప్పారు. దేశంలోని ముఖ్య రాష్ట్రాల్లో ఏపీ ఒకటన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఏపీ జాతీయ రహదారులను మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

## అచ్చెన్నాయుడు ఇప్పుడే నిద్రలేచారా?: మంత్రి అమర్‌నాథ్

విశాఖపట్నం: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పెట్టుబడిదారుల నుంచి వచ్చిన స్పందనే తమ ప్రభుత్వ పారిశ్రామిక విధానమని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు.కేవలం సంవత్సరం, రెండు సంవత్సరాల్లోనే సాకారమయ్యేలా ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు.రికార్డు స్థాయిలో తొలి రోజు రూ.11.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు. ఈ రెండు రోజుల సదస్సు ద్వారా రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తున్నామని గర్వంగా చెబుతున్నామన్నారు. వీటి ద్వారా 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలుంటాయన్నారు. కేవలం సీఎం జగన్ బ్రాండ్ వల్లే ఏపీకి ఈ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని స్పష్టంచేశారు.14 రంగాలలో ఫోకస్ చేద్దామనుకున్నప్పటికీ 20 రంగాలలో పెట్టుబడులు వచ్చాయి. దేశ, విదేశాల ప్రముఖులకు తమ ప్రభుత్వం ఇచ్చిన నమ్మకం వల్లే పెట్టుబడుల ప్రవాహం వచ్చింది. ఏపీకి సహజ వనరులు ఎన్నో ఉన్నాయి. రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ నిరంతరం కృషి చేస్తున్నారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి రెండో రోజు సదస్సు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు."ఏపీకి వచ్చిన పెట్టుబడులపై ఫాలో అప్ ఉండాలని సీఎం జగన్ సూచించారు. ప్రభుత్వానికి మరింత బాధ్యత పెరిగింది. కోవిడ్ వల్ల రెండేళ్ల పాటు ఈ తరహా సమావేశాలు నిర్వహించలేకపోయాం. టీడీపీ హయాంలో చేసుకున్న ఎంఓయూలలో పది శాతం మాత్రమే ప్రారంభమైతే సీఎం జగన్ హయాంలో ఇప్పటి వరకు 80 నుంచి 90 శాతం ప్రారంభమయ్యాయి. ఈ సమ్మిట్ లో చేసుకున్న ఎంఓయూలు నూరు శాతం ప్రారంభమవుతాయి." అని అమర్‌నాథ్ పేర్కొన్నారు.అలాగే సమ్మిట్‌పై టీడీపీ నాయకులు చేస్తున్న విమర్శలపై అమర్‌నాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అచ్చెన్నాయుడు ఇపుడే నిద్రలేచారా?. అంబానీ, అదానీ, దాల్మియా, బజాంకాలని ఆయన ఎపుడైనా చూశాడా?. ఈ సమ్మిట్‌కు వచ్చిన అనూహ్య స్పందనపై ప్రశంసించకపోయినా పర్వాలేదు, కానీ తప్పుడు విమర్శలేంటి?' అంటూ నిప్పులు చెరిగారు. అయ్యారు.



## ప్రధాని మోదీని కలిసిన కెవిన్ పీటర్సన్

ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశాడు. కాగా పీటర్సన్ ఢిల్లీలో నిర్వహించిన రైసీనా డైలాగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చాడు.ఈ సందర్భంగా మొదట హోంమంత్రి అమిత్ షాతో పీటర్సన్ మాటామంతీ చేశాడు. అనంతరం ప్రధాని మోదీని కలిసిన పీటర్సన్.. ఈ విషయాన్ని ట్విటర్‌లో షేర్ చేసుకున్నాడు. ప్రధాని తన పుట్టిన రోజున చీతాలను తీసుకురావడం హర్షించదగిన విషయమన్నాడు. మోదీని కలవడాన్ని గొప్పగా భావిస్తున్నట్లు చెబుతూ పీటర్సన్ పోస్టు పెట్టారు.ఇటీవలే దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు 12 చీతాలు వచ్చాయి. వాయుమార్గం ద్వారా యుద్ధ విమానాల్లో మధ్యప్రదేశ్ గ్వాలియర్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌కు వీటిని తీసుకొచ్చారు. అనంతరం కునో నేషనల్ పార్కుకు హెలికాప్టర్లలో తరలించారు. ఈ 12 చీతాల్లో ఐదు మగవి కాగా.. ఏడు ఆడవి. భారత్‌లో అంతరించిపోతున్న చీతాల సంఖ్యను పెంచేందుకు ఆఫ్రికా దేశాలతో భారత్ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే.ఇందులో భాగంగానే గతేడాది సెప్టెంబర్‌లో 8 చీతాలు నమీబియా నుంచి భారత్‌కు వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ తన పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17న వీటిని కునో నేషనల్ పార్కులో విడుదల చేశారు. తాజాగా వచ్చిన చీతాలతో కలిపి కునో నేషనల్ పార్కులో మొత్తం చీతాల సంఖ్య 20కి చేరింది.



# సంపాదకీయం

శనివారం 04-03-2023

## స్టాలిన్ కు నార్త్ సపోర్ట్ వచ్చేనా


విపక్షాల ప్రధాని అభ్యర్థిగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్? ఈ వార్త ఒక్క సారిగా రాజకీయాలలో పెను సంచలనం సృష్టించింది. ఔను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎందుకు విపక్షాల ఉమ్మడి ప్రధాని ఎందుకు కాకూడదు అని జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్బుల్లా చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బీజేపీయేతర పార్టీలన్నీ వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ఏకతాటిపైకి వచ్చి కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న ప్రయత్నాలను ఇప్పటికే ప్రారంభించాయి.వచ్చే సార్వత్రిక ఎన్నికలలో విపక్షాల ఐక్య కూటమి అధికారం చేపడితో ప్రధాని రాహుల్ గాంధీయేనన్నది ఆ పార్టీ శశభిషలకు ఆస్కారం లేకుండా స్పష్టం చేసింది. అయితే అంతలోనే స్టాలిన్ ను ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదిస్తూ యూపీఏ భాగస్వామ్య పక్షమైన నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత చేసిన ప్రతిపాదన విపక్షాల ఐక్యతా యత్నాలకు గండి కొడుతుందా అన్న విషయం రానున్న రోజులలో తేలుతుంది. ఇప్పటికిప్పుడైతే స్టాలిన్ ప్రధాని అన్న ప్రతిపాదనపై రాజకీయంగా చర్చ అయితే జరుగుతోంది కానీ.. ఔను, కాదు అన్న కంక్లూజన్ కు అయితే ఏ పార్టీ రాలేదు. అదే సమయంలో సహజంగానే ఈ ప్రతిపాదనపై బీఆర్ఎస్ కానీ తృణమూల్ కానీ స్పందించ లేదు. ఎందు కంటే ఆ రెండు పార్టీలూ వేటికవిగా తమతమ ప్రయత్నాలు చేసుకుంటున్నాయి. అయితే ఇక్కడ ప్రధానంగా కాంగ్రెస్ స్పందన ఏమిటన్నది అందరిలోనూ ఆసక్తిగా మారిందికేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఎలా ఉన్న వ్యూహరచనల్లో నిమగ్నమై ఉన్నాయి. అయితే విపక్షాల ఐక్యతా యత్నాలు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్న చందంగా సాగుతున్నాయి. అదే సమయంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం విపక్షాలు ఇప్పటి నుంచే చేయి చేయి కలిపి పని చేయాల్సిన అవసరం ఉందని, కాలయాపన ఇసుమంతైనా కూడదని బీహార్ సీఎం నితీష్ కూమార్ వంటి నేతలు అంటున్నారు. అంతే కాకుండా.. విపక్ష కూటమికి కాంగ్రెస్ నాయకత్వం వహించాలనీ చెబుతున్నారు. కేంద్రంలో బీజేపీని దీటుగా ఎదుర్కొనాలంటే.. కాంగ్రెస్ నాయకత్వంలో జట్టుకట్టడం వినా మరో మార్గం లేదనీ నితీష్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లు మాత్రం వేరేగా ఆలోచిస్తున్నారు. వారిరువురూ కూడా తమ, తమ నాయకత్వంలోనే విపక్షాల ఐక్యత ఉండాలని భావిస్తున్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్, తృణమూల్ కాంగ్రెస్ లు రెండూ కూడా ఎవరి దారి వారిది అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. బీజేపీయేతర పార్టీల ఐక్యత సవ్య దిశలో వెళ్లడం లేదన్న విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి. సరిగ్గా ఈ తరుణంలోనే.. ఛత్తీస్ గఢ్ రాజధాని నయా రాయ్ పూర్ వేదికగా జరిగిన కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ చేసిన తీర్మానం ఐక్యతా యత్నాలను మరో అడుగు వెనక్కు తీసుకువెళ్లిందనే చెప్పాలి. కేంద్రంలో బీజేపీని గద్దె దించాలంటే.. విపక్షాలు ఏకం కావాలన్న అభిప్రాయంతో ఏ బీజేపీయేతర పార్టీకీ మరో అభిప్రాయం లేదు.. అయితే ఆ ఐక్య కూటమికి నేతృత్వం వహించేది ఎవరన్న విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆ భిన్నాభిప్రాయాలకు కారణం కూడా ప్రధాని పదవేనన్న విశ్లేషణల నేపథ్యంలో కాంగ్రెస్ తన విధానం ఏమిటన్నది క్లారిటీ ఇచ్చేసింది. వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని స్పష్టం చేసిన కాంగ్రెస్ ఆ ప్రభుత్వానికి సారథ్యం వహించేది కాంగ్రెస్ మాత్రమేనని కుండ బద్దలు కొట్టేసింది.విపక్ష కూటమి తన సారథ్యంలోనే జరగాలని ఇప్పటికే ప్రకటించేసిన కాంగ్రెస్ తాజాగా ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో కనీసంగానైనా ప్రభావం చూపని నేపథ్యంలో ఇంకా ప్రధాని పదవి కోసం పాకులాడుతుందా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఏడాదే మరో ఆరు రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ వేచి చూసే ధోరణి అవలంబిస్తుందా అన్న చర్చ కూడా సాగుతోంది.స్వయంగా స్టాలినే కాంగ్రెస్ సారథ్యంలోనే విపక్ష కూటమి.. మూడో ఫ్రంట్ చర్చే వేస్ట్ అని చెప్పిన నేపథ్యంలో ఫరూఖ్ అబ్దుల్లా ప్రతిపాదనకు ఆయన ఎలా రియాక్ట్ అవుతారన్నది చూడాలి. పైగా ఫరూక్ అబ్దుల్లా ఈ ప్రతిపాదన స్టాలిన్ జన్మదిన వేడుకలలో స్టాలిన్ సమక్షంలోనే చేశారు.

# త్వరలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం

విజయవాడ, మార్చి 3, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలో ఉంటారు. నియోజక వర్గాల్లో కార్యక్రమాలు ఉన్నపుడు మినహా సమీక్షలు, సమావేశాలు, భేటీలు ఆయన ఇంట్లోనే జరుగుతుంటాయి. తాడేపల్లి నివాసం నుంచే ముఖ్యమంత్రి కార్యకలాపాలు దాదాపు నాలుగేళ్లు సాగుతున్నాయి. అదే సమయంలో ముఖ్యమంత్రి మాత్రం ఆదుకోవాలని వచ్చే వారికి కనీసం దర్శనం కూడా ఇవ్వట్లేదనే అపవాదు ఉంది.ప్రజల నుంచి వచ్చే వినతులను సంతృప్తస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో జగనన్నకు చెబుదామనే కార్యక్రమాన్ని ప్రాంభించాలని రెండు మూడు నెలల క్రితం ముఖ్యమంత్రి భావించారు. ఒకటి రెండు సార్లు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలున్న శాఖల విభా?గాధిపతులతో చర్చలు కూడా జరిపారు. సమస్య రావడం ఆలశ్యం దానిని వెంటపడి పరిష్కరించాలని ఆదేశించారు.స్పందన కార్యక్రమంలో భాగంగా అత్యధిక అర్జీలు అందుకుంటున్న ప్రభుత్వ విభాగ అధిపతులతో ముఖ్యమంత్రి ఫిబ్రవరి మొదటి వారంలో కూడా సమీక్ష నిర్వహించారు. అర్జీల పరిష్కారంలో అనుసరించాల్సిన విధానాలపై సమగ్రంగా సమాలోచనలు చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభానికి అధికారులు సన్నద్ధం కావాలని ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమం ఎక్కడి వరకు వచ్చిందనే సంగతి మాత్రం మరచిపోయారు.ప్రతి ప్రభుత్వ విభాగాధిపతి ప్రతి వినతిని పరిష్కారం అయ్యేంతవరకూ ట్రాక్ చేయాలని, ప్రభుత్వానికి అందిన అర్జీలపై ప్రతి వారం కూడా ఆడిట్ చేయాలని, ప్రతి వారం కూడా నివేదికలు తీసుకోవాలని అధికారులను సూచించారు. నిజానికి క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు, రాజకీయ కారణాలతో మరుగున పడిపోయే సమస్యలు, రకరకాల కారణాలతో నెలలు, సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉండే ఫిర్యాదులతో నిత్యం ముఖ్యమంత్రికి మొరపెట్టుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి బాధితులు తాడేపల్లి వస్తుంటారు.గతంలో ఈ తరహా ఫిర్యాదుల కోసం ముఖ్యమంత్రులు ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించే వారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఫిర్యాదుల్లో చాలా వరకు బుట్టదాఖలవడం, పరిష్కారాలు చూపకుండానే దరఖాస్తుల్ని క్లోజ్ చేస్తున్న ఉదంతాలున్నాయి. స్పందన స్థానంలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ముఖ్యమంత్రి మదిలో మెదిలింది. ఫిర్యాదుల ట్రాకింగ్, పర్యవేక్షణ జరుగుతుందా? లేదా? అన్నదానిపై ప్రతివారం కూడా సమీక్ష చేయాలని సిఎం ఆదేశించారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో అర్జీలు, ఫిర్యాదుల స్వీకరణకు ఇప్పటికే ఉన్న కాల్ సెంటర్లను అనుసంధానించాలని, వివిధ విభాగాల్లో వినతుల పరిష్కారం కోసం ఇప్పటివరకూ ఉన్న పద్ధతులను మరోసారి పరిశీలించి, తిరిగి పునర్నిర్మాణం చేయాలని సూచించారు.సీఎంఓతో పాటు ప్రతి ప్రభుత్వ శాఖలో కూడా జగనన్నకు చెబుదాం ప్రాజెక్ట్ మానిటరింగ్ విభాగాలు ఉండాలి. తర్వాత జిల్లాస్థాయిలోనూ, మండలస్థాయిలో కూడా ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం మానిటరింగ్ యూనిట్లు మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల స్థాయిలో కూడా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. స్థూలంగా స్పందనకు అత్యంత సమర్థవంతమైన, మెరుగైన విధానమే " జగనన్నకు చెబుదాం" అని చెప్పారు.

# టెక్నాలజీతో తిరుమల దేవస్థానము


తిరుమల, మార్చి 3, తిరుమలలో మార్చి 1 నుంచి ప్రయోగాత్మకంగా ఫేస్ రికగ్నేషన్ టెక్నాలజీ ప్రవేశపెట్టినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. గదుల కేటాయింపు, కాషన్ డిపాజిట్ తిరిగి చెల్లించే కౌంటర్ల వద్ద ఈ బయోమెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది టీటీడీ. ఫొటో ఆధారిత బయోమెట్రిక్ అమలుతో దళారులకు అడ్డుకట్ట వేయనుంది. గదుల కేటాయింపు సమయంలో ఫొటో క్యాప్చర్ తీసుకుంటున్నారు. గదులు ఖాళీ చేసే సమయంలో క్యాప్చర్ అయినా ఫొటో మ్యాచ్ అయితేనే కాషన్ డిపాజిట్ అకౌంట్ లో జమ చేస్తారు. రూమ్ రొటేషన్ విధానం ఆగిపోవడంతో త్వరిత గతిన సామాన్య భక్తులకి గదులు త్వరగా అందించగలుతోంది. గతంలో దళారుల చేతివాటంతో గదుల రొటేషన్ విధానం సాగుతూ వచ్చిన.... ఇప్పుడు ఫొటో ఆధారిత బయోమెట్రిక్ ద్వారా దళారులు గదులు పొందే అవకామే లేదు. ఉచిత లడ్డు జారీ విధానంలో సైతం ఫొటో ఆధారిత బయోమెట్రిక్ ప్రవేశపెట్టామని, లడ్డు మిస్యూస్ కాకుండా ఉండేందుకు ఈ విధానం పనిచేయనుంది అధికారులు తెలిపారు. తిరుమలలో ఫేస్ రికగ్నేషన్ టెక్నాలజీ అమలుతో అసలేన భక్తులు గదులు పొందుతున్నారని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. దీంతో దళారులు తగ్గారన్నారు. తిరుమలలోని పద్మావతి విచారణ కార్యాలయం, సీఆర్వో, ఎంబీసీ ప్రాంతాల వద్ద భక్తులకు గదులను కేటాయించే కౌంటర్ల వద్ద ఈవో ధర్మారెడ్డి ఫేస్ రికగ్నేషన్ టెక్నాలజీని గురువారం పరిశీలించారు. మరో 15 రోజుల పాటు ఈ విధానాన్ని పరిశీలిస్తామన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా సర్వదర్శనానికి వెళ్లే భక్తులకు లడ్డూ ప్రసాదం అందించేందుకు త్వరలో ఫేస్ రికగ్నేషన్ టెక్నాలజీ ద్వారా టోకెన్లు అందజేస్తా?మన్నారు. తిరుమలలో దళారులను పూర్తిగా తగ్గించేందుకు, టీటీడీ సౌకర్యాలు భక్తులకు అందించేందుకు ఫేస్ రికగ్నేషన్ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తిరుమలలో సర్వదర్శనం, లడ్డూ ప్రసాదం, గదుల కేటాయింపు, రీఫండ్ చెల్లింపు అంశాల్లో ఈ టెక్నాలజీ ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్టు ఈవో ధర్మారెడ్డి తెలిపారు. గదులను రొటేషన్ చేసే పద్ధతిని పూర్తి స్థాయిలో అరికట్టవచ్చని చెప్పారు. గదుల కోసం పేర్లు నమోదు చేసుకున్న భక్తులకు తొందరగా రూములు దొరుకుతున్నాయని ఈవో తెలిపారు.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవారి భక్తుల కోసం మొబైల్ యాప్ ను ఇటీవల అప్ డేట్ చేసింది. ఇది వరకు ఉన్న "గోవింద" యాప్ నే టీటీ దేవస్థానమ్స్ పేరుతో దీన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది. జియో ప్లాట్ ఫామ్ ద్వారా ఈ యాప్ ను అభివృద్ధి చేసినట్లే టీటీడీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ యాప్ ద్వారా ఎస్వీబీసీ భక్తి ఛానల్లో వచ్చే కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చని తెలిపింది. దర్శనం, గదులు, ఆర్జిత సేవా టికెట్లను భక్తులు నేరుగా బుకింగ్ చేసుకునే సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొంది. యావ్ లో తిరుమల చరిత్ర స్వామి వారి కైంర్యాల వివరాలను పొందుపరిచినట్లు స్పష్టం చేసింది. ఇప్పటికే గోవింద యాప్ ను తమ మొబైళ్లలో కల్గి ఉన్న వారు గూగుల్ ప్లే స్టోర్ నుంచి "టీటీ దేవస్థానమ్స్"ను అప్ డేట్ చేసుకోవాలని టీటీడీ సూచించింది. కొత్త వారు నేరుగా టీటీ దేవస్థానమ్స్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని వివరించింది.



# తిరుమలకు ఎలక్ట్రిక్ బస్సులు

తిరుమల, మార్చి 3,తిరుమల శ్రీవారికి ఎంఈఐఎల్ (మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్) అందించే ఉచిత ఎలక్ట్రిక్ బస్సుల నమూనా సిద్ధమైంది. త్వరలోనే 10 ఎలక్ట్రిక్ బస్సులు టీటీడీకి అందనున్నాయి. ఆ తర్వాత తిరుమల కొండపై ఒలెక్ట్రా ఈ-బస్సులు సేవలు అందిచనున్నాయి.ఎంఈఐఎల్ గ్రూప్ అనుబంధ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్ టెక్? లిమిటెడ్ ఈ బస్సులను హైదరాబాద్ సమీపంలోని తన ప్లాంట్ లో తయారు చేస్తోంది. టీటీడీ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన తొలి బస్సును దేవస్థానముల రవాణా విభాగం జనరల్ మేనేజర్ పీవీ శేషారెడ్డి సమగ్రంగా పరిశీలించారు. ఒలెక్ట్రా తయారు చేసిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 10 ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే)కు అందించాలని ఎంఈఐఎల్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ బస్సులను తిరుమలను సందర్శించే భక్తులకు కాలుష్య రహిత ప్రయాణం అందించేందుకు టీటీడీ వినియోగించనుంది. టీటీడీ అధికారులకు బస్సు పనితీరును ఒలెక్ట్రా ప్రతినిధులు వివరించారు. ప్రయాణికులకు పూర్తి భద్రత కల్పించేలా బస్సును తయారు చేశామని తెలిపారు. బస్సుల్లో ఎలెక్ట్రానిక్ డిస్ప్లే బోర్డ్ ద్వారా ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయా ణిస్తోందో తెలిపే వివరాలు పొందుపరిచారు.భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుమలలో తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది, తిరుమల పవిత్రత, ప్రాశస్త్యాన్ని తెలిపే ఫోటోలను బస్సుపై పొందు పరిచారు. బస్సులో కొద్దిదూరం ప్రయాణించిన శేషారెడ్డి... పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. దేవస్థానం పాలకవర్గం, ఉన్నతాధికారులకు బస్సు పని తీరును వివరిస్తామని తెలిపారు. ఎంఈఐఎల్ విద్యుత్ బస్సులను అందించటం సంతోషంగా ఉందని, వీటి వల్ల తిరుమల కొండపై కాలుష్య నియంత్రణ జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఒలెక్ట్రా గ్రీన్టెక్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కేవీ.ప్రదీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ "ఎంఈఐఎల్ భగవంతుని సేవలో ఎప్పుడూ ముందుంటుంది. సంస్థ ప్రయాణంలో వేంకటేశ్వర స్వామి ఇచ్చిన ఆశీర్వాదాలకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుకోగలుగుతున్నాము. సంస్థ పురోగతి, భవిష్యత్తు ప్రయత్నాలలో స్వామివారి ఆశీస్సులు తమపై ఉండాలని కోరుకుంటున్నాము. 9 మీటర్ల పొడువున్న 10 ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానానికి త్వరలో అందించనున్నాము. ఈ-బస్సుల కోసం ఛార్జింగ్? పాయింట్లు కూడా ఏర్పాటు చేస్తున్నాము" అని తెలిపారు.శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు పరిశుభ్రమైన, వాయు, శబ్ధ కాలుష్యంలేని ప్రయాణాన్నిఈ విద్యుత్ బస్సుల ద్వారా అందిస్తామని ప్రదీప్ తెలిపారు. ఒలెక్ట్రా అందిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు తిరుమలను పర్యావరణ హితంగా మార్చుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తిరుమలలో 12 డీజిల్ బస్సులు భక్తులకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల సేవలు ప్రారంభం అయితే టీటీడీకి డీజిల్ ఖర్చుల భారం తగ్గటంతో పాటు పర్యావరణం మెరుగుపడేందుకు ఎంతో అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో 50 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు ప్రతిరోజూ తిరుపతి , తిరుమల మధ్య నడుస్తూ భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే.ప్రస్తుతం తిరుమలలో 12 డీజిల్ బస్సులు భక్తులకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల సేవలు ప్రారంభం అయితే టీటీడీకి డీజిల్ ఖర్చుల భారం తగ్గటంతో పాటు పర్యావరణం మెరుగుపడేందుకు ఎంతో అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో 50 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు ప్రతిరోజూ తిరుపతి , తిరుమల మధ్య నడుస్తూ భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే.

# విజయసాయిపై వైసీపీ లెన్స్...



విశాఖపట్టణం, మార్చి 3, వైసీపీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు విజయాసాయిరెడ్డి సైలెన్స్ వెనుక కారణాలేమిటన్న చర్చ ఆ పార్టీలో విస్తృతంగా సాగుతోంది. నిత్యం విపక్షాలపై విమర్శలతో, ట్వీట్లతో తెలుగుదేశం అగ్రనేతలపై వ్యంగ్య కామెట్లతో వార్తల్లో ఉండే విజయసాయి గత కొంత కాలంగా నిశ్శబ్దం పాటిస్తున్నారు. పార్టీ వేదికలపైనా, కార్యక్రమాలలోనూ కూడా పెద్దగా కనిపించడం లేదు. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అర్థం కాక వైసీపీ శ్రేణులు తలలు బద్దలు కొట్టుకుంటున్నాయి. నిత్యం.. పార్టీలోని నాయకులతోనో.. కార్యకర్తలతోనో భేటీ కావడం... లేదా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం.. అదీ కాదనుకుంటే.. సామాజిక మాధ్యమం ద్వారా ప్రతిపక్ష పార్టీల అధినేతలు, నాయకులపై విమర్శలు గుప్పించడం చేస్తుండే విజయ సాయి హఠాత్తుగా సైలెంట్ అయిపోవడం పార్టీ శ్రేణుల్లో పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు విజయసాయిరెడ్డి.. సమీప బంధువు నందమూరి తారకరత్న మరణం, ఆ తరువాత ఆయన తెలుగుదేశం అధినేత, ఆ పార్టీ ఎమ్మెల్యే నటుడు బాలకృష్ణతో ఒకింత సేపు మాట్లాడటంతో వైసీపీ అధిష్ఠానం ఆయన్ని దూరంగా పెట్టిందనే ప్రచారం కూడా జోరందుకుంది. ఆ క్రమంలోనే విజయసాయిరెడ్డిని స్టేట్ ఇన్ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించి.. ఆ బాధ్యతలను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అప్పగించారని అంటున్నారు. ఇంకోవైపు బెంగుళూరులోని నారాయణ హృదయాలయ ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న నందమూరి తారకరత్నను విజయసాయిరెడ్డి పరామర్శించి.. ఆయన ఆరోగ్య పరిస్థితిపై.. ఆసుపత్రి వైద్యులను అడిగి మరీ తెలుసుకొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తారకరత్న ఆరోగ్య పరిస్థితిపై ఆయన చాలా వివరింగా వివరిస్తూ మాట్లాడారు. విజయసాయిరెడ్డి మాటల ద్వారా తారకరత్న ఆరోగ్య పరిస్థితిపై ప్రజలందరికీ ఓ క్లారిటీ అయితే వచ్చిందనే ఓ టాక్ సైతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే తారకరత్న ఆరోగ్యంపై ఇంత క్లారిటీగా చెప్పిన విజయసాయిరెడ్డి.. 2019, మార్చి 15న దారుణ హత్యకు గురైన వైయస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని ఎలా చెప్పారంటూ విజయసాయిరెడ్డిని నెటిజన్లు ఓ రేంజ్ లో ట్రోల్ చేశారు. అయినా ఆయన సెలెంట్ గానే ఉండిపోయారు. తారకరత్న మరణం, అంతకు ముందు ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైసీపీ నేతలు మాట్లాడిన మాటలకూ పూర్తి భిన్నంగా.. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వాటిని ఖండిస్తున్నట్లుగా విజయసాయి మాటలు ఉన్నాయి. ఇదే జగన్ కు ఆయనపై ఆగ్రహం కలగడానికి కారణంగా పార్టీ శ్రేణులు అంతర్గత సంభాషణల్లో చెప్పుకుంటున్నారు. అయితే విజయసాయి మౌనం వెనుక అత్యంత బలమైన కారణముందన్న అనుమానాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమౌతున్నాయి. వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురి అయితే.. ఆయన గుండెపోటుతో మరణించారంటూ మొట్టమొదటగా మీడియా ముందుకు వచ్చి ప్రకటించిందీ విజయసాయిరెడ్డేనని ఇప్పుడు అదే తన తలకు చుట్టుకుంటుందన్న భయంతోనే విజయసాయి మౌనం వహిస్తున్నారన్న చర్చ కూడా జోరుగా సాగుతోంది. వివేకా హత్య కేసులో సీబీఐ.. దూకుడు పెంచడం, ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్ను తెలంగాణ హైకోర్టు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చిన నేపథ్యంలో వివేకా హత్య కేసు సాధ్యమైనంత త్వరగా ఓ కొలిక్కి వస్తుందని అటు రాష్ట్ర ప్రజలే కాదు.. ఇటు వైయస్ వివేకా ఫ్యామిలీలోని వారు సైతం భావిస్తున్నారు. మరోవైపు వైయస్ వివేకా హత్య కేసులో చోటు చేసుకున్న వరుస పరిణామాలపై ఇప్పటికే తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు.. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా హు కిల్డ్ బాబాయి అంటూ ముఖ్యమంత్రి జగన్ను ఉద్దేశించి చమత్కార బాణాలు విసురుతున్నారు. ఇక తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా

లోకేశ్ అయితే యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రలో భాగంగా వైయస్ వివేకా హత్యపై జగన్ ప్రభుత్వానికి వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. కానీ వీటికి విజయసాయిరెడ్డి.. సోషల్ మీడియా ద్వారా గతంలో లాగా తనదైన శైలిలో స్పందించడం లేదని... ఓ వేళ.. వీటికి ఆయన తన తరహాలో స్పందిస్తే.. అందుకు కౌంటర్గా వివేకా గుండెపోటుతో మరణించారంటూ నీకు ఎవరు చెప్పారంటూ సీబీఐ రంగంలోకి దిగి.. ఈ విజయసాయిరెడ్డికి నోటీసులు జారీ చేసే అవకాశం లేకపోలేదని.... ఈ నేపథ్యంలో సాధ్యమైనంత వరకు మౌనంగా ఉండేందుకు విజయసాయిరెడ్డి ప్రయత్నిస్తున్నారనే ఓ టాక్ వినిపిస్తోంది.

# పాపం... సుబ్బారావు గుప్తా...

ఒంగోలు, మార్చి 3,ఇంతకీ ఈ సుబ్బారావు గుప్తా ఎవరంటారా? గతంలో సుబ్బారావు గుప్తాపై బాలినేని అనుచరులు దాడి తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. వైసీపీ ఎమ్మెల్యే బాలినేని అనుచరుల చేతిలో దెబ్బలు తిని రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తే ఈ సుబ్బారావు గుప్తా. అప్పట్లో బాలినేని ప్రధాన అనుచరులు ఒక లాడ్జిలో సుబ్బారావు గుప్తాను కొడుతున్న వీడియో ఒకటి తెగ వైరల్ అయ్యింది. మంత్రి బాలినేని అనుచరులుగా ఉన్న వారి వల్ల పార్టీకి నష్టం జరుగుతుందంటూ సుబ్బారావు గుప్తా విమర్శించడంతో ఆయనను బాలినేని అనుచరులు ఒక లాడ్జి రూంలో చితక్కొట్టారు. మోకాళ్ల మీద కూర్చోబెట్టి క్షమాపణలు చెప్పించారు. ఆ తరువాతి రోజే బాలినేని తెరమీదకు వచ్చి సుబ్బారావు గుప్తాను ఇంటికి పిలిపించుకుని రాజీ చేసుకున్నారు. అయ్యిందేదో అయ్యింది... ఇక మనమంతా ఒకటే అంటూ కేకు కట్ చేసి ఎపిసోడ్ కు ఫుల్ స్టాప్ పెట్టారు.వైసీపీలో రెబల్ గా ఉన్నా, పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినా కష్టాలు ఎదుర్కోక తప్పదు. పార్టీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణం రాజు, కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డిల తరువాత తాజాగా వైసీపీ నాయకుడు సుబ్బారావు గుప్తాకు కూడా అనుభవం లోకి వచ్చింది. గంజాయి కేసులో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అయితే గుప్తా మాత్రం ఆ తరువాత వైసీపీ రెబల్ గా మారారు. తనపై దాడి చేసిన వారికి పోలీసులు రాచమర్యాదలు చేసి మరీ స్టేషన్ బెయిల్ ఇచ్చారని విమర్శలు గుప్పించారు. పర్యటనలు చేసి మరీ రాష్ట్ర వ్యాప్తంగా తనకు మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నించారు. బెజవాడలో ఆర్య వైశ్య ఐక్యత సభ నిర్వహించి ఒంగోలులో చోట రాజన్, డీ గ్యాంగులు ఉన్నాయంటూ అప్పట్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం జగన్ పిలిచినా తాను కలవలేదని కూడా అప్పట్లో ప్రకటించారు. సరే నెమ్మదిగా ఆ వ్యవహారం అంతా సైడైపోయిందని అంతా భావించారు. కానీ అప్పటి నుంచీ సుబ్బారావు గుప్తా వైసీపీ రెబల్ గానే ఉంటూ వచ్చారు. ఇటీవలి కాలంలో సుబ్బారావు గుప్తా తన విమర్శల దాడిని తీవ్రం చేశారు. బాలినేని, ఆయన కుమారుడిపై ఆరోపణలు గుప్పిస్తున్నారు.బాలినేని అనుచరుడు సుభాని తన అనుచరులతో కలిసి ఒక వసతి గృహంపై దాడి చేసిన సంఘటనలో బాలినేని తీరును నిరసిస్తూ సుబ్బారావుగుప్తా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఆ తరువాత రెండు రోజుల వ్యవధిలోనే సుబ్బారావు గుప్తాను గంజాయి కేసులో పోలీసులు అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నారు. సుబ్బారావును పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఒంగోలులో సంచలనం సృష్టించింది.

## ఆ ఫ్యామిలీ అంతా అంతేనా...తెరపైకి చిన్నకోడలు

విజయనగరం, మార్చి 3, విజయనగరంలో 13 ఏళ్లపాటు భార్య సుప్రియను గృహ నిర్బంధంలో ఉంచిన న్యాయవాది గోదావరి మధుసూదనరావు కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. తననూ కొన్నేళ్లపాటు గృహనిర్బంధంలో ఉంచారని.. భరించలేక ఆ ఇంటి నుంచి బయటకు వచ్చేశా అంటూ సుప్రియ తోడికోడలు.. గోదావరి మధుసూదనరావు సోదరుడు, వెంకట దుర్గాప్రసాద్ భార్య డెంటిస్ట్ వెంకట పుష్పలత తెలిపింది. తన పెద్ద కుమారుడు ఇప్పటికీ అక్కడే ఉన్నాడని, వెంటనే తనకు అప్పగించాలని విజయనగరంలోని అత్తింటి వారి ముందు గురువారం ఆందోళనకు దిగింది. విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో 13 ఏళ్లపాటు గృహనిర్బంధంలో ఉన్న సుప్రియ బుధవారం ఆ చీకటి రోజుల నుంచి బయటపడ్డారు. ఆమెను తల్లి, సోదరుడు తమతోపాటు తీసుకెళ్లారు. ఈ విషయం సంచలనం కాగా.. గురువారం.. మధుసూదన్ తమ్ముడి భార్య తెరపైకి వచ్చారు. మధుసూదరావు సోదరుడు దుర్గాప్రసాద్ భార్య పుష్పలత అత్తింటివారి ఇంటికి వచ్చి నిరసన తెలియజేసింది. తన పెద్ద కుమారుడు పదేళ్ల గోదావరి దీర్ఘాయుష్ గాయత్రిబాబును అప్పగించాలని వేడుకుంది. 2012లో దుర్గాప్రసాద్‌తో ఆమెకు వివాహమైంది. వీరికి 2013లో పెద్ద కుమారుడు, 2015లో మరో కుమారుడు జన్మించారు. ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ.. పుష్పలతను సైతం సుప్రియ మాదిరి గృహ నిర్బంధానికే అత్తింటివారు పరిమితం చేశారు. ఇంట్లో పనులకే వినియోగించేవారు. బాత్రూమ్ దగ్గర కూర్చోబెట్టి కుక్కకు పెట్టినట్లు ఒక ప్లేటులో ఆహారం పెట్టేవారని పుష్పలత చెబుతోంది. తన తల్లిదండ్రులకు ఇబ్బంది కాకూడదనే ఉద్దేశంతోనే చాలా కాలం మౌనంగా భరించానని తెలిపింది. పెద్ద కుమారుడితోనే తనను పిన్ని అని పిలిపించేవారని వాపోయింది. తన కన్నకొడుకుని ఏనాడూ దగ్గరకు రానిచ్చేవారు కాదని చెప్పింది. అప్పట్లో ఏడాది వయస్సున్న చిన్న కుమారుడికి ఆరోగ్యం బాగోలేకపోతే కనీసం తనకు చూపించలేదని, అడిగితే.. 'చచ్చిపోతే చచ్చిపోనీయ్!' అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని కన్నీరు పెట్టుకుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో పెద్ద కుమారుడిని విడిచిపెట్టి, 2016లో చిన్నకుమారుడిని తీసుకుని ఆ ఇంటి నుంచి బయటపడ్డానని వివరించింది. పెద్ద కుమారుడికి కనీసం అమ్మగా కూడా తాను తెలియనని కన్నీటిపర్యంతమైంది. ఇన్నాళ్లూ తోడికోడలు సుప్రియ ఉందనే భరోసాతో కుమారుడిని విడిచిపెట్టానని తెలిపింది. ఇప్పుడు ఆమె కూడా లేకపోతే తన కుమారుడికి రక్షణ ఉండదని వాపోయింది. భర్త, అత్తింటివారి ఆగడాలపై గతంలోనే పోలీసులకు, గృహహింస విభాగ సిబ్బందికి కూడా ఫిర్యాదులు చేశానని తెలిపింది. పెద్ద కోడలుతోపాటు.. చిన్న కోడలినీ గృహనిర్బంధంలో ఉంచడం.. వరుసగా ఈ ఘటనలు వెలుగులోకి రావడం విజయనగరంలో చర్చనీయాంశంగా మారింది. అసలు గోదావరి మధుసూదనరావు, దుర్గాప్రసాద్, వారి తల్లి ప్రవర్తనపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు వారెందుకు ఇలా ప్రవర్తిస్తున్నారో.. ముమ్ముందు వీరి కుటుంబం కోసం ఎలాంటివి వినాల్సి వస్తుందోనని చర్చించుకుంటున్నారు.

## మద్యం మత్తులో నదిలోకి దిగి గల్లంతు

విజయవాడ, మార్చి 3, కృష్ణానది ఒడ్డున ఆగి ఉన్న ఓ స్కార్పియో.. దూరంగా నదిలో తేలుతూ కనిపించిన ఓ వ్యక్తి శవం.. వాహనం చుట్టుప్రక్కల చూస్తే.. ముగ్గురు ఆ ప్రదేశానికి వచ్చినట్లుగా, ఏదో మందు పార్టీ జరిగినట్లుగా ఆనవాళ్లు.. అటుగా వెళ్తోన్న స్థానికులు ఈ తతంగాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అసలక్కడ ఏం జరిగింది.? మద్యం మత్తులో నదిలోకి దిగి గల్లంతయ్యారా? ఒకవేళ అదే జరిగితే ఒక డెడ్‌బాడీ మాత్రమే ఎందుకు తేలింది. మిగతా ఇద్దరూ ఉన్నారా.. వాళ్లూ గల్లంతయ్యారా? ఇలాంటి అనేక ప్రశ్నలు ప్రస్తుతం సస్పెన్స్‌గా మారాయి. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకుంది. ఆ వివరాలు ఏంటి.? అక్కడేం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందామా.?కృష్ణాజిల్లాలోని చోడవరంలో అనుమానస్పద ఘటన జరిగింది. స్థానిక కృష్ణానది పాయ వద్ద ముగ్గురు వ్యక్తులు గల్లంతయినట్లుగా తెలుస్తోంది. ఘటనాస్థలి వద్ద స్కార్పియో వాహనంతో పాటు నదిలో ఓ వ్యక్తి డెడ్‌బాడీ తేలుతూ కనిపించడంతో అక్కడున్న స్థానికులు వెంటనే ఖాకీలకు సమాచారం అందించారు. కారులో మద్యం బాటిళ్లు, ముగ్గురికి సంబంధించి విడిచిన బట్టలను పోలీసులు గుర్తించారు. వారంతా కూడా గల్లంతయినట్లుగా పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఓ వ్యక్తి డెడ్‌బాడీ మాత్రమే లభ్యం కావడంతో మిగతా ఇద్దరి జాడ కోసం పోలీసులు, గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. మందుపార్టీ కోసం వచ్చి ముగ్గురూ గల్లంతయ్యారా? లేదంటే ఇంకేదైనా క్రైమా అన్నదానిపై పోలీసుల ఆరా తీస్తున్నారు. అయితే వచ్చిన ముగ్గురు ఎవరు? శవమై తేలిన ఆ వ్యక్తి ఎవరన్నదానిపైనా ఇంకా క్లారిటీ లేదు. కానీ స్కార్పియో నెంబర్ ఆధారంగా ఆ వాహనం మొగలురాజుపురానికి చెందినదిగా గుర్తించారు పోలీసులు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యోగ సంఘాలతో మంత్రి చర్చలు

విజయవాడ, మార్చి 3, (న్యూస్ పల్స్)ఒకవైపు అమరావతి జేఏసీ ఆందోళనలకు సిద్ధమవుతుంటే, మరోవైపు ఇతర ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపింది ప్రభుత్వం. ప్రత్యేకించి సచివాలయ ఉద్యోగ సంఘం నేతలతో మంత్రి బొత్స సమావేశమై చర్చించారు. ఉద్యోగ సంఘాల నేతలైన బండి శ్రీనివాసరావు, వెంకట్రామిరెడ్డి, ఇతర నాయకులతో విడివిడిగా మాట్లాడారు బొత్స. మొత్తం 94 ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా అనేకవాటిపై హామీలు లభించాయ్. ముఖ్యంగా 13వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి. పదేళ్ల సర్వీస్ దాటిన వాళ్లందరినీ రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం ఒప్పుకుందన్నారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఉద్యోగులపై నమోదైన 16వందల కేసులను కూడా మాఫీ చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఒప్పుకుందని, వాళ్లకు సర్వీస్ రూల్స్, జాబ్ ఛార్ట్ సిద్ధం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు వెంకట్రామిరెడ్డి.అయితే, ఇది అనధికారిక సమావేశం అంటున్నారు ఏపీ జేఏసీ అమరావతి నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు. తాము సీఎస్‌కి నోటీస్ ఇవ్వడం వల్లే చర్చలకు పిలిచారని చెప్పుకొచ్చారు. జీతాలు ఎందుకు ఆలస్యంగా ఇస్తున్నారని అడిగామన్న బొప్పరాజు, ఆర్థిక అంశాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ప్రభుత్వానికి తెగేసి చెప్పామన్నారు.వెంకట్రామిరెడ్డి వ్యాఖ్యలకు భిన్నంగా మాట్లాడారు బొప్పరాజు. ప్రభుత్వం చెప్పిన ఒక్క హామీ కూడా నెరవేరలేదన్నారు. ఉద్యమ కార్యాచరణ నుంచి వెనక్కి తగ్గేదే లేదంటోన్న బొప్పరాజు, ఈనెల 9నుంచి యథాతథంగా పోరాటంలోకి వెళ్తామని తేల్చిచెప్పారు. అయితే, మళ్లీ ఏడో తేదీన సీఎస్‌తో మీటింగ్ ఉందంటున్నారు మరో ఉద్యోగ సంఘం నేత బండి శ్రీనివాస్. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు

### ఎవరి దారి వారిదే

విశాఖపట్టణం, మార్చి 3, జనసేన పార్టీతో కలిసే పోటీ చేస్తున్నాం అధికారంలోకి వస్తున్నాం అని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సోము వీర్రాజు ప్రెస్ మీట్ పెట్టినప్పుడల్లా ప్రకటిస్తూంటారు. అలాగే జనసేన పార్టీ కూడా పొత్తుల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు తాము ఇంకా బీజేపీతోనే పొత్తులో ఉన్నామని చెబుతూ ఉంటారు. అంటే రెండు పార్టీల్లోనూ ఓ రకంగా ఇంకా తాము పొత్తుల్లోనే ఉన్నామన్న అభిప్రాయం ఉంది. కానీ అది క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. దానికి ఉదాహరణే ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి జనసేన మద్దతు ప్రకటించకపోవడం. మర్యాదపూర్వకంగానైనా మద్దతు ఇవ్వాలని పవన్ ను అడగాలనే ఆలోచన బీజేపీ చేయలేదు. అడగనిదే ఎందుకు మద్దతివ్వాలని పవన్ కూడా మిత్రపక్షానికి ఓటేయాలని పిలుపునివ్వలేదంటున్నారు.తిరుపతి లోక్ సభ ఉపఎన్నికల్లో తాము పోటీ చేస్తామంటే తాము పోటీ చేస్తామని అటు బీజేపీ ఇటు జనసేన పోటీ పడ్డాయి. చివరికి బీజేపీ పోటీ చేయడానికి అంగీకారం కుదిరింది. పవన్ కల్యాణ్ కూడా ప్రచారం చేశారు. అయితే ఫలితం ఏ మాత్రం ప్రోత్సాహకరంగా లేదు. తర్వాత బద్వేలు, ఆత్మకూరు ఉపఎన్నికలు వచ్చాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలు చనిపోవడం.. కుటుంబసభ్యులకే చాన్సివ్వడంతో పవన్ కల్యాణ్ జనసేన పోటీ చేయదని ప్రకటించారు. కానీ బీజేపీ మాత్రం పోటీ చేసింది. పవన్ కల్యాణ్ మద్దతు తమకేనని ప్రచారం చేసుకున్నారుఆ పార్టీ నేతలు. ఇప్పుడు మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల్ని ప్రకటించింది. కానీ జనసేన పార్టీ మద్దతు గురించి మాత్రం స్పందించడం లేదు. తమంతటకు తాముగానే ప్రచారం చేసుకుంటున్నారు. మార్చి 14వ తేదీన మచిలీపట్నంలో జనసేన ఆవిర్భావ సభ నిర్వహించాలనుకుంటున్న జనేసన పార్టీ.. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి మాత్రం వేయవద్దు.. మీ ఇష్టం వచ్చినవారికి వేయండి అని పార్టీ సానుభూతిపరులకు నాదెండ్ల మనోహర్ సందేశం పంపారు. ఇదే పవన్ కల్యాణ్ సందేశం అని ప్రకటించారు. దీంతో రాజకీయ పార్టీల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. బీజేపీతో పొత్తులో ఉన్న పవన్ కల్యాణ్ తాము పోటీ చేయకపోతే మిత్రపక్షం బీజేపీకి ఓటు వేయాలని ప్రకటన చేయవచ్చు కదా అనే సందేహం వారికి రావడమే దీనికి కారణం. ఎంత మిత్రపక్షం అయినప్పటికీ మద్దతు కోరడం సంప్రదాయం. ఏపీ బీజేపీ నేతలు ఇంత వరకూ పవన్ కల్యాణ్ మద్దతు కోరినట్లుగా స్పష్టత లేదు. ఆ మాటకు వస్తే ఇటీవలి కాలంలో పవన్ కల్యాణ్ ఏ ఒక్క బీజేపీ నేత కలవలేదు. ప్రస్తుతం ఏపీ బీజేపీలో పరిస్థితులు అంత గొప్పగా లేవు. వర్గాలుగా మారి విమర్శలు చేసుకుంటున్నారు. కొంత మంది పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజుపై ఎక్కువ అసంతృప్తి కనిపిస్తోంది. దీంతో ఆయన కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం తిరుగుతున్నారుకానీ.. పవన్ ను కలిసి మద్దతు అడగాలనే ఆలోచన చేయలేదు. పవన్ మద్దతు అడగకపోవడంతో.. అడగకుండా మద్దతు ఇవ్వడం ఎందుకని పవన్ కల్యాణ్ కూడా సైలెంట్ అయినట్లుగా చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో జనసేన పార్టీకి యువత నుంచి కూడా మద్దతు ఉంటుంది. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్సీ మాధవ్ మళ్లీ పోటీ చేస్తున్నారు. పవన్ మద్దతిస్తే ప్లస్ అయ్యేది. కానీ ఆయన మద్దతు కోసం బీజేపీ ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం ఆశ్చర్యకరంగా మారింది. పవన్ కల్యాణ్.. ఏపీ ఎన్నికల్లో ఖచ్చితంగా బీజేపీతో కలిసి పోటీ చేస్తానని చెప్పడం లేదు. సందర్భాన్ని బట్టి ప్రకటనలు చేస్తున్నారు. అదే సమయంలో బీజేపీ నేతలు జనసేనను కలుపుకుని రాజకీయం చేద్దామన్న ప్రయత్నం చేయడం లేదు. దీంతో రెండు పార్టీల మధ్య బయట ప్రకటనల్లో చెబుతున్నంత గొప్పగా పొత్తు లేదని.. ఎవరికి వారే అన్నట్లుగా ఇప్పటికే విడిపోయారన్న భావం బలపడుతోంది.

# కోటంరెడ్డి లెక్క తప్పిందే

నెల్లూరు, మార్చి 3, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి రాజకీయంగా ఇక అన్ని దారులు మూసుకుపోయినట్లేనని తెలుస్తోంది. ఆయన తొందరపడి అధికార పార్టీ నుంచి బయటకు వచ్చారని ఆయన అనుచరుల్లో సయితం అభిప్రాయం బలంగా వ్యక్తమవుతుంది. నెల్లూరు జిల్లాలో కోటంరెడ్డి చేరికపై టీడీపీ నేతల నుంచి వ్యతిరేకం వ్యక్తం కావడంతో ఆయనను చేర్చుకోవడంపై పార్టీ అధినేత చంద్రబాబు కూడా కొంత పునరాలోచనలో పడ్డారని చెబుతున్నారు. దీంతో కోటంరెడ్డి రాజకీయంగా అటు కాకుండా.. ఇటు కాకుండా.. ఎటూ కాకుండా పోయారన్న టాక్ సింహపురిలో బలంగా వినిపిస్తుంది. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తాను టీడీపీలోకి వెళుతున్నట్లు నేరుగా కార్యకర్తల సమావేశంలోనే ప్రకటించారు. అయితే కోటంరెడ్డి రాకను పార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో పాటు మరికొందరు నేతలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. టీడీపీ టిక్కెట్ దక్కించుకుని గెలిచిన తర్వాత తిరిగి వైసీపీ గూటికి కోటంరెడ్డి వెళ్లినా ఆశ్చర్యం లేదని వారు చంద్రబాబు వద్ద ఎదుట చెప్పినట్లు తెలిసింది. కోటంరెడ్డి పై పరోక్షంగా సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా కామెంట్స్ చేశారు. కోవర్టులు వస్తున్నారంటూ జాగ్రత్తగా ఉండాలంటూ పార్టీ నేతలను ఆయన హెచ్చరించడం కూడా చర్చనీయాంశమైంది. స్థానిక టీడీపీ నేతలు కూడా కోటంరెడ్డికి వ్యతిరేకంగా సమావేశాలు పెడుతున్నారు. కోటంరెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ వైసీపీ నుంచి బయటపడ్డారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయనకు ఇక నియోజకవర్గంలో అన్ని రకాలుగా అధికార పార్టీ లాక్ చేసింది. వెంటనే ఇన్‌ఛార్జిగా ఆదాల ప్రభాకర్ రెడ్డిని నియమించి అధికార యంత్రాంగం మొత్తం ఆదాల కనుసన్నుల్లోనే పని చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కోటంరెడ్డి ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదు. అధికారులు ప్రొటోకాల్ కూడా పాటించడం లేదు. ఎన్నికలకు ఇంకా ఏడాది ముందుగానే కోటంరెడ్డి తీసుకున్న నిర్ణయం ఆయనను రాజకీయంగా ఇబ్బందుల పాలు చేసిందనే చెప్పాలి. ఇక వరసగా టీడీపీ అధినేత చంద్రబాబు ఇతర పార్టీల నేతలకు కండువాలు కప్పుతున్నారు. కానీ కోటంరెడ్డి విషయంలో మాత్రం కండువా కప్పకపోయినా పాజిటివ్ గా లేరంటున్నారు. ఒక్క నేత వచ్చినంత మాత్రాన పార్టీ జిల్లాలో మరింత ఇబ్బందుల్లో పడుతుందని ఆయన భావిస్తున్నారు. టీడీపీకి కోటంరెడ్డి చేరిక వల్ల కొత్తగా వచ్చే లాభమేదీ లేదు. వైసీపీకి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గత నాలుగేళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న నేతలను ఇబ్బంది పెట్టి కోటంరెడ్డికి రెడ్ కార్పెట్ వేయడం సరికాదన్నది చంద్రబాబు భావనగా ఉంది. అందుకే కోటంరెడ్డి లెక్క తప్పిందంటున్నారు. ఆయన ఇప్పుడు మరో పార్టీవైపు చూడాల్సిందే. జనసేన కూడా అతనిని నమ్మి టిక్కెట్ ఇచ్చే పరిస్థితి ఉంటుందా? అన్నది కూడా సందేహమే. ఇక కోటంరెడ్డికి బీఆర్ఎస్ నుంచి పోటీ చేయడం మినహా మరో దారి లేదని చెబుతున్నారు. మరి కోటంరెడ్డి పొలిటికల్ ఫ్యూచర్ ఎలా ఉండనుందన్నది రానున్న కాలంలో తెలియాల్సిందే.

## ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు కు మర్యాదపూర్వకంగా కలిసిన మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి



(అరకులోయ ఉదయం న్యూస్)అరకులోయ: గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా ఎన్నిక కానున్న ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.కుంభా రవిబాబుకు వైఎస్సార్ సిపి మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి శుభాకాంక్షలు తెలియజేశారు. అరకులోయ మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించిన డా.కుంభా రవిబాబు గారికి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేస్తూ, దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. చట్టసభల్లో గిరిజనులకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యతపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న మంత్రి కొట్టు

విశాఖపట్నం విశాఖలో పారిశ్రామిక వేత్తలు సదస్సు లక్షల కోట్లు వస్తున్నాయని చెప్పుకొ నేది కాదని, ఒక ప్రణాళిక బద్దంగా ముఖ్యమంత్రి పెడుతున్న సదస్సు అన్నారు మంత్రి కొట్టు సత్యనారాయ ణ.సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న నమ్మకం తో భారతదేశం నుండే కాక, ప్రపంచ దేశాలనుండి పెట్టుబడిదారులు వస్తు న్నారని అన్నారు.రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు కావలసిన వన రులు పుష్కలంగా ఉన్నాయనే నమ్మ కం పారిశ్రామిక వేత్తలు కలిగిందని వెయ్యి కిలోమీటర్ల మేర కోస్టల్ కారి డార్ ఉండటం, వారి వారి ఉత్పత్తుల ను రవాణా చేసుకోవడానికి అనువైన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మని అన్నారు

### ఇంటి పత్రాలు దొరికితే మాకు సమాచారం ఇవ్వండిలావణ్య రాజ గౌడ్

కౌతాళం మా ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు దొరికితే మాకు తెచ్చి ఇవ్వలని రిజిస్ట్రేషన్ పత్రాలు తెచ్చిన వ్యక్తులను జీవితంలో మరిచిపోము ....మీరు చేసిన మేలు మరువలేము ...మా మీద దయ తలచి ఎవరికైనా దొరికితే తెచ్చి ఇవ్వాలని వల్లూరు గ్రామ దంపతులు మురుణి లావణ్య, రాజా గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు.వివరాల్లోకి వెళ్ళితే మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన శ్రీమతి మురుణి లావణ్య భర్త పేరు రాజా గౌడ్ మార్చి 1వ తేదీన ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు కనిపించడం లేదని సర్వే నెం 134 .ఇంటి నెం 1/150. 01.03.2023న ఉదయం 10.00 గంటలకు కౌతాళం నుండి వల్లూరు మరియు పొలముకు వెళ్తుండగా, వల్లూరు గ్రామంలోని తన ఇంటికి చేరుకోగా ఆమె ప్లాస్టిక్ బ్యాగ్ కనిపించలేదని అన్నారు. సంఘటన స్థలంలో వెతికి, చుట్టుపక్కల వ్యక్తులను విచారించిన ఫలితం లేదని వాపోయారు. ఈ విషయాన్ని కౌతాళం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని అన్నారు. మా రిజిస్ట్రేషన్ పత్రాలు ఎవరికైనా దొరికి ఉంటే మాకు తెచ్చి ఇవ్వాలని ఆ దంపతులు మనస్ఫూర్తిగా వేడుకున్నారు.

## బ్రెయిన్ డెడ్ అయిన వారి గుండెను దానం చేయడానికి కుటుంబసభ్యులు ముందుకు రావాలి

**- డయల్ యువర్ ఈవోలో టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి**

తిరుమల, మార్చి 03శ్రీ పద్మావతి చిన్న పిల్లల గుండె ఆసుపత్రిలో నెల రోజుల్లోనే రెండు గుండెమార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించామని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి గుండెను దానం చేయడానికి వారి కుటుంబ సభ్యులు ముందుకురావాలని ఆయన పిలుపు నిచ్చారు. గుండె దానం చేయాలనుకునే వారు ముందుగా టీటీడీ కి తెలియజేస్తే వైద్యబృందం సకాలంలో వచ్చి గుండె సేకరించి దాన్ని మరో బాలుడు లేదా బాలికకు అమర్చి వారి ప్రాణాలు కాపాడటం జరుగుతుందన్నారు.తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి, ఆ తరువాత మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.తిరుమలలో. గదుల కేటాయింపు, డిపాజిట్ తిరిగి చెల్లింపు ప్రక్రియలో మార్చి 1 నుండి ప్రయోగాత్మకంగా ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వినియోగిస్తున్నాము. దీనివల్ల దళారీల బెడద దాదాపుగా తొలగింది. సర్వదర్శనం భక్తులకు వైకుంఠం రెండో క్యూ కాంప్లెక్స్ లో కూడా ఈ పరిజ్ఞానం ఉపయోగిస్తాము. దీనివల్ల ఉచిత లడ్డూల పంపిణీలో అవకతవకలు జరక్కుండా నిరోధించవచ్చు.తిరుమలలోని గోకులం కార్యాలయంలో శ్రీవాణి ఆఫ్‌లైన్ దర్శన టికెట్ల జారీని తిరిగి ప్రారంభించడం జరిగింది. భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టికెట్లు జారీ చేస్తారు. దీనివల్ల దళారుల బెడద పూర్తిగా తొలగుతుంది.తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర ప్రాథమిక, ఉన్నత పాఠశాల దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీమతి సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్‌తో అవగాహన ఒప్పందం(ఎంఓయు) కుదుర్చుకుంది.దీనివల్ల పాఠశాల సమగ్ర అభివృద్ధి జరుగుతుంది. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందుతుంది.తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు పాదరక్షలు భద్రపరుచుకునేందుకు వీలుగా ఏప్రిల్ రెండవ వారంలో 11 కౌంటర్లు ఏర్పాటు చేస్తాం.పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులోని ఆంధ్ర గీర్వాణ కళాశాల ప్రాంగణంలో ఫిబ్రవరి 28న శ్రీనివాస రుక్ సంహిత చతుర్వేద హవనం ప్రారంభమైంది. మార్చి ఆరో తేదీ వరకు ఏడు రోజులపాటు ఈ కార్యక్రమం జరగనుంది.శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు శుక్రవారం సాయంత్రం ప్రారంభం కానున్నాయి. మార్చి 7వ తేదీ వరకు జరుగనున్నాయి.మార్చి 7న కుమారధార తీర్థ ముక్కోటి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాము.మార్చి 18న తిరుమలలో శ్రీ అన్నమాచార్య వర్ధంతి ఘనంగా నిర్వహిస్తాము.మార్చి 22న శ్రీ శోభకృత్ నామ ఉగాది సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 30న శ్రీరామనవమి ఆస్థానం, 31న శ్రీరామ పట్టాభిషేకం ఆస్థానం నిర్వహిస్తారు.మార్చి 31 నుండి ఏప్రిల్ 8వ తేదీ వరకు వై ఎస్ ఆర్ జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.ఏప్రిల్ 5న శ్రీ సీతారాముల కల్యాణం జరుగనుంది.

రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి శ్రీ వై ఎస్ జగన్మోహన్ రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యులు నెల రోజుల వ్యవధిలో రెండవ గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి అరుదైన రికార్డు సృష్టించారు. ఆసుపత్రి ప్రారంభించిన 15 నెలల్లోనే 1150 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడం జరిగింది. క్యాన్సర్, కిడ్నీ, గుండె తదితర వ్యాధుల కారణంగా భరించలేని నొప్పితో బాధపడుతున్న రోగులకు ఉపశమనం కల్పించడం కోసం ఫిబ్రవరి 4వ తేదీ నుండి స్విమ్స్‌లో పెయిన్ పాలేటివ్ కేర్ సెంటర్ ప్రారంభించాం. ఇక్కడ నిర్వహిస్తున్న ఓపిడి, ఐపిడిలకు రోగుల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది.స్విమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్న క్యాన్సర్ రోగులకు వైద్య సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు ఎప్పటికప్పుడు చికిత్సకు సంబంధించిన విషయాలు తెలియజేయడం కోసం క్యాన్సర్ కేర్ ట్రాకర్ యాప్‌ను ప్రారంభించాం. దేశంలో ఈ తరహా యాప్‌ను మొట్టమొదటగా స్విమ్స్‌లోనే ప్రారంభించడం జరిగింది.పుట్టుకతోనే చెవుడు మూగతో బాధపడేవారికి బర్డ్‌లో స్మైల్ ట్రైన్ సంస్థ సహకారంతో ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేస్తున్నాం. రూ.20 లక్షల వ్యయమయ్యే ఈ ఆపరేషన్ ఉచితంగా నిర్వహించి చెవుడు మూగ సమస్యల నుంచి వారికి విముక్తి కల్పించి కొత్త జీవితాన్ని అందిస్తున్నాం.బర్డ్ ఆసుపత్రిలో ఏ వయసువారికైనా ఉచితంగా గ్రహణమొర్రి ఆపరేషన్లు నిర్వహించి వారు స్పష్టంగా మాట్లాడగలిగేలా తయారు చేస్తున్నాం. 5 నెలల కాలంలో 50 ఆపరేషన్లు నిర్వహించాం. రూ.2 లక్షలు ఖర్చు అయ్యే ఈ ఆపరేషన్‌ను ఉచితంగా చేయడంతోపాటు వారికి రవాణా ఖర్చులు, పోషకాహారం తీసుకునేందుకు సహాయం చేస్తున్నాం. అలాగే బర్డ్‌లో అధునాతన సిటి స్కాన్ ఏర్పాటుచేసి బయటి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు కూడా తక్కువ ధరకు సిటి స్కాన్ చేస్తున్నాం.టీటీడీ ఆయుర్వేద ఫార్మశీని మరింత బలోపేతం చేసి ఔషధాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతున్నాం. 314 రకాల ఫార్ములాలకు ఆయుష్ శాఖ నుండి అనుమతి లభించింది. వీటిలో 60 రకాల మందులు మొదటి దశలో ఉత్పత్తి చేసి రోగులకు అందుబాటులో ఉంచుతాం.అన్నప్రసాదం దుష్ప్రచారంపై ఖండన తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం పై రాధామోహన్ దాస్ అనే భక్తుడు దురుద్దేశ పూర్వకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో ప్రచారాన్ని ఈవో ఖండించారు. ఇందుకు సంబంధించి పలువురు భక్తులు అన్నప్రసాదం చాలా బాగా ఉందని వెల్లడించిన వీడియో ను ప్రదర్శించారు.అన్నప్రసాద కేంద్రంలో ఉపయోగించే బియ్యంఇతర సరుకులు కూరగాయలు వివిధ దశల్లో క్షుణ్ణంగా పరీక్షించిన తరువాతే వంటకు ఉపయోగిస్తున్నామని ఈవో వివరించారు. టీటీడీ మీద రాధామోహన్ దాస్ చేసిన దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని ఈవో విజ్ఞప్తి చేశారు.

## వాలంటరీ మృతికి సంతాపం తెలియజేసిన ఎమ్మెల్యే



జూపాడు బంగ్లా తేది.03-03-2023 న మన నందికొట్కూరు గౌరవ శాసనసభ్యులు శ్రీ తొగురు.ఆర్థర్ గారు, జూపాడు బంగ్లా మండల కేంద్రంలోని 1వ సచివాలయం పరిధిలో వాలంటీర్ గా పనిచేస్తున్న షేక్ రియాజుద్దీన్ గారు తేది.01-3-2023 న మరణించినారని తెలిసి వారి కుటుంబాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బంగ్లా సర్పంచ్ శ్రీ మోతే బాలయ్య గారు, మండల నాయకులు శ్రీ జంగాల పెద్దన్న గారు, శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి గారు, శ్రీ ఉస్మాన్ భాష గారు, శ్రీ శివానంద రెడ్డి గారు, శ్రీ దేవ సహాయం గారు, డాక్టర్ ఎర్రన్న గారు, నక్క మల్లికార్జున గారు, ఈ ఓ ఆర్ డి శ్రీమతి.మణిమంజరి గారు, పంచాయితీ కార్యదర్శి శ్రీ శాంతయ్య గారు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఇతర వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించడం జరిగింది.

# సోమేశిల జలాశయం ముంపు గ్రామాల నిరుద్యోగులకు త్వరలో ప్రభుత్వ ఉద్యోగాలు



బద్వేలు , సోమేశుల జలాశయం నిర్మాణంలో ముంపుకు గురైన గ్రామాలలో నిరుద్యోగ అభ్యర్థుల ఉద్యోగాలు ఇచ్చే విషయంపై దాదాపు ఒక కొలిక్కి వచ్చింది ప్రభుత్వ ఉత్తర్వులు రాష్ట్ర ఉన్నత అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలు అనుసరించి చేపట్టిన కసరత్తు తుది దశకు చేరుకుంది వారం పది రోజుల్లో తుది జాబితాను ఉన్నత అధికారులకు నివేదించాలని ఇంజనీరింగ్ అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు దరఖాస్తుదారుల్లో చాలా తక్కువ మందికి ఉద్యోగ అర్హత ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు ఉమ్మడి కడప జిల్లాలో బద్వేలు నియోజకవర్గానికి సంబంధించి అట్లూరు గోపవరం రాజంపేట నియోజకవర్గానికి సంబంధించి నందలూరు ఒంటిమిట్ట సిద్ధవటం పెనగలూరు మండలాల్లో 105 గ్రామాలు పూర్తిగా 9 గ్రామాలు పాక్షికంగా ముంపుకు గురయ్యాయి ఈ జలాశయం నిర్మాణానికి 1975 జూన్ 6వ తేదీ శంకుస్థాపన చేయగా 1988 నవంబర్లో జాతికి అంకితం చేశారు ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు స్థలాలు ఇల్లు ఇతర కట్టడాలు నష్టపోయిన వారికి పరిహారం చెల్లించారు పునరావాస ప్యాకేజీని వర్తింప చేయలేదు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఆయా కుటుంబాల్లో ఉన్న సభ్యులకు విద్యా అర్హత ఉంటే ఇంటికో ఉద్యోగం ఇస్తామని అప్పటి పాలకులు

### 1335 మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలుస్పష్టం చేస్తున్న సోమశిల జలాశయం ఉన్నతాధికారులు నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు



ప్రకటించారు ఈ మేరకు 1986 ఏప్రిల్ 15వ తేదీ అప్పటి ప్రభుత్వం ఉత్తరువు 98 జారీ చేసింది ఆ తరువాత అర్హతలపై 2013 ఆగస్టు 22 తేదీ మరో ఉత్తరువు ఇచ్చారు ఇప్పటివరకు 321 మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది సరైన అవగాహన లేక చాలామంది దరఖాస్తులు చేసుకోలేదు ప్రభుత్వానికి తమ బాధ చెప్పుకోవడంతో మరోసారి అవకాశం ఇచ్చారు 2014 తరువాత దాదాపు 5000 మంది దరఖాస్తు చేసుకున్నారు ఉద్యోగాలు ఇవ్వడంలో అన్యాయం జరుగుతుందని నాలుగు సంవత్సరాల కింద కొంతమంది నిరుద్యోగులు కోర్టుకు వెళ్లారు మార్పులు చేర్పులు సవరణలు చేసుకోవాలని 2021జూన్లో అధికారులు మరో అవకాశం ఇచ్చారు జాబితాలో చోటు చేసుకున్న తప్పులు పొరపాట్లను సరిదిద్దారు అర్హుల జాబితాలో వెనుక ఉన్న పేర్లను ముందుకు తీసుకురావాలని రాష్ట్ర సర్వోన్నత న్యాయ స్థానం 2022 జూలై 7వ తేదీ తీర్పు ఇచ్చింది మొత్తం9751 మంది దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయి హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎంపిక ప్రక్రియ ఎలా చేపట్టాలో మార్గదర్శకాలు ఇవ్వాలని సోమేశిల జలాశయం ఎస్సీ కార్యాలయం ఇంజనీరింగ్ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారుదీనిపై ప్రభుత్వ ఉత్తర్వు 98 ప్రకారం 2013 లో ఇచ్చిన మెమోను అనుసరించాలని గత నెల 13 తేది ఉత్తర్వులు ఇచ్చారు ఈ నేపథ్యంలో అవార్డు పరిహారం చెల్లింపు గ్రామంలోకి చేరిన వెనుక జలాలు సొంత ఊరు నుంచి ఎప్పుడు ఖాళీ చేశారు దరఖాస్తు ఎప్పుడు ఇచ్చారు విద్యా అర్హతలు ఏమిటి అనే విషయాలపై గత 20 రోజులుగా పరిశీలన చేస్తున్నారు ఇందుకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తయింది జాబితాపై అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం 1335 మందికి మాత్రమే ఉద్యోగ అర్హత ఉందని నిర్ధారించారు కొలువు వస్తుందో లేదు తెలియక నిరుద్యోగులు ఉత్కంఠతో ఉన్నారు మరోవైపు కొంతమంది దళారులు రంగంలోకి దిగి మా వాళ్ళకి ఉద్యోగం ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం ఈ మేరకు పైరవీలు కూడా చేస్తున్నారు తుది జాబితాను మరో వారం రోజుల్లో ఉన్నత అధికారులకు పంపుతామని సోమేశిల సీనియర్ అధికారి ఒకరు ధ్రువీకరించారు

# నంద్యాల పురపాలక సంఘం వారి ఆదేశాలు

నంద్యాల - విషయం. - నంద్యాల మున్సిపల్ పరిధిలోని నివాస. నివాసేతర గ్రుహేల యజమాను దారులకు తమ భవనాలకు సంబంధించిన ఇంటి పన్ను. ఖాళి స్దలం పన్ను కుళాయి పన్నులను 31-03-2023 వతేది లోపల చెల్లించాలని కోరడమైనది. ఆ విధంగా చెల్లింపులు చేయని యెడల మీ మీ ఇండ్లకు సంబంధించిన కుళాయిలను ఎటువంటి నోటీసులు జారీ చేయకుండానే తాత్కాలికంగా తొలగించ బడునని మరియు తదుపరి 1965 మున్సిపాలిటీ చట్ట ప్రకారం మీకు లీగల్ నోటీసులు జారీ చేసి ఆపై తదుపరి చర్యలు గైకొని మీ నుండి రావలసిన బకాయిలను రాబట్టు కొన బడునని పత్రికల ద్వారా తెలియజేయడ మైనది. -- ఇట్లు సి. రవి చంద్రా రెడ్డి కమిషనర్. నంద్యాల పురపాలక సంఘం.

# రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టండి

### --ఈ నెల 7వ తేదీలోగా ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయండి
### --రెవెన్యూ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి



నంద్యాల :-జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం కింద రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి రెవెన్యూ రికార్డుల మేరకు నాణ్యతతో భూ వివాదాలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ అన్ని మండలాల తాసిల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో పిఓఎల్ఆర్ రీ సర్వే, ఎమ్మెల్సీ ఎన్నికలు, భూసేకరణ, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ పిఓఎల్ఆర్ కింద చేపట్టిన సర్వేలో నాణ్యత ప్రమాణాలు పాటించి రీసర్వే కార్యక్రమాన్ని పక్కాగా పకడ్బందీగా చేపట్టాలన్నారు. భూ వివాదాలను పరిష్కరించడమే సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యమని... నాణ్యతతో నిర్దేశిత సమయంలోగా సర్వే పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. బనగానపల్లి, కోవెలకుంట్ల, గోస్పాడు, చాగలమర్రి, నందికొట్కూరు తదితర అన్ని మండలాలు× పిఓఎల్ఆర్ సర్వే పెండింగులో వుందని త్వరితగతిన పూర్తి చేసేందుకు తాసిల్దారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.. చేపట్టిన రీ సర్వే నాణ్యతతో పరిష్కరించకుంటే అనేక రకాల డిస్ప్యూట్స్ రావడంతో పాటు స్పందన కార్యక్రమంలో మళ్లీ మళ్లీ దరఖాస్తులు వస్తాయన్నారు. వెబ్ లాండ్, ఆర్ఓఆర్ లో ఉన్న భూముల విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూముల విస్తీర్ణానికి తేడాలున్నట్లు పత్రికల్లో ప్రతికూల వార్తలు వస్తున్నాయని.... ఈ నేపథ్యంలో సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధతో నిశితంగా పరిశీలించి సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన సర్వే ప్రక్రియను ఆర్డీవోలు, తాసిదారులు ర్యాన్డంగా చెక్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 7వ తేదీ సాయంత్రం లోగా ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయాలని.... ఇందుకు సంబంధించి రోజువారి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ తాసిల్దార్లను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఆయా మండల కేంద్రాలలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లన్నింటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎన్నికల నిబంధనల మేరకు అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్లో వెబ్ కాస్టింగ్ ఉంటుందని ఈ మేరకు నిరంతర విద్యుత్తుతో పాటు ఎలక్ట్రికల్ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని మండలాల్లో ఫామ్ 6 బి పెండింగ్లో ఉందని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాల్సిన సమస్యలపై ఆరా తీస్తూ ఎందుకు పెండింగ్లో ఉన్నాయని మండలాల వారీగా తాసిల్దార్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కోర్టుల్లో పెండింగ్లో ఉన్న కేసులకు సంబంధించి కంటెంట్ రాకుండా కౌంటర్ ఫైల్ చేయాలని జాయింట్ కలెక్టర్ తాసిల్దార్ లను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి, ఎం దాసు, అన్ని మండలాల తాసీల్ధార్లు,కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు తదితరులు పాల్గొన్నారు.


# 13 లక్షల కోట్ల పెట్టుబడులు

విశాఖపట్టణం, మార్చి 3, ఆంధ్రప్రదేశ్ కు 20 రంగాల పారిశ్రామికవేత్తల నుంచి 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని సీఎం జగన్ ప్రకటించారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సులో సీఎం జగన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడుల గురించి చెప్పారు. ఈ పెట్టుబడుల వల్ల 6 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. 340 పెట్టుబడుల ప్రతిపాదనలు మా ముందుకు వచ్చాయి.. 20 రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని. శుక్రవారం రూ. 8.54 లక్షల కోట్ల ఎంవోయూలు జరుగుతాయని వైఎస్ జగన్ ప్రకటించారు. ప్రస్తుతం ఆరు పోర్టులు.. ఆరు ఎ?యిర్ పోర్టులతో అత్యధిక మానవ వనరుల శక్తి ఏపీ కలిగి ఉన్నదని సీఎం జగన్ పారిశ్రామిక వేత్తల దృష్టికి తీసుకెళ్లారు. దేశంలోనే అత్యధిక జీఎస్డీపీ వృద్ధి ఉన్న రాష్ట్రం ఏపీ అని సీఎం తెలిపారు. గ్రీన్ ఎనర్జీపై ప్రధానంగా ఫోకస్ దేశ ప్రగతికి ఏపీ కీలకంగా మారిందని గ్రీన్ ఎనర్జీపై ప్రధానంగా ఫోకస్ పెడుతున్నామని సీఎం జగన్ తెలిపారు. పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలతో నెంబర్ వన్గా నిలిచామన్నారు. ఏపీలో మూడు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయన్నారు. రాష్ట్రం నుంచి ఎగుమతులు గణనీయంగా పెరగాయని గుర్తు చేశారు. పలు కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తామన్నారుభారతదేశానికి ఏపీ ఎంతో ముఖ్యమని రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ పేర్కొన్నారు. రాష్ట్రంలో 5జీ నెట్వర్క్ 90శాతం కవర్ చేస్తున్నట్లు తెలిపారు.


# అమ్మాయిల్నే కాదు.. వాళ్లమ్మల్ని ఒప్పించాలి!




తెలుగు సినిమా ఇండస్ట్రీ లో తెలుగు అమ్మాయిల్ని ఎందుకు తీసుకోరు? అని చాలా కాలంగా వినిపిస్తున్న ప్రధానమైన విమర్శ. తెలుగు అమ్మాయిలుండగా ముంబై...ఢిల్లీ..బెంగుళూరు బ్యూటీల్ని ఎందుకు దిగుమతి చేసుకోవాలి. సినిమాలంటే ఫ్యాషన్ ఉన్న వాళ్లు ఇక్కడ లేరా? తెలుగు అమ్మాయిలు అందంగా ఉండరా? అవకాశాలు కల్పిస్తే సొంత భాష వాళ్లు ఎందుకు పైకి రారు? తెలుగు వాళ్లు అంటే చిన్న చూపా? అన్న వాదన ఎప్పటికప్పుడు వినిపిస్తుంది. దీనిపై అప్పుడప్పుడు చిన్న పాటి ఉద్యమాలు కూడా నడిచాయి. శ్రీరెడ్డి లాంటి వాళ్లు మీడియా ముందు ఎలాంటి రాద్ధాంతం చేసారో కూడా తెలిసిందే.అయితే తాజాగా ఓ స్టార్ డైరెక్టర్ ఓ తెలుగు హీరోయిన్ దగ్గర ఇక్కడ అమ్మాయిలకు అవకాశాలు కల్పించక పోవడానికి గల కొన్ని కారణాలు రివీల్ చేసారు. 'తెలుగు అమ్మాయిలకు అవకాశాలు ఇవ్వలేక కాదు. ఇవ్వాలని మాకు ఉంటుంది. వాళ్లను ఒప్పించడమే కష్టమవుతుందన్నారు. అప్పట్లో ఓసినిమా కోసం ఆ డైరెక్టర్ రాసుకున్న పాత్రకి తెలుగు హీరోయిన్..అందులో కొత్త ముఖం అయితే బాగుంటుందని భావించారుట. దీనికోసం కాలేజీలు చుట్టూ తిరాగారుట. అలా ఓ అమ్మాయి తన పాత్రకి సెట్ అవుతుందని ..అమ్మాయితో మాట్లాడి ఒప్పిస్తే....వాళ్ల అమ్మ మాత్రం ఒప్పుకోలేదుట. ఒక్క సినిమా కే..మళ్లీ ఆమెని మరో సినిమాలో తీసుకోం. ఒప్పుకోండని ఎంత కన్విన్స్ చేసినా ఒప్పుకోలేదుట.ఆ అమ్మాయికి ఆసక్తి ఉన్నా? కొందరు అజ్ఞానంతో ఇలా వచ్చిన అవకాశాల్ని వదులుకోవాల్సి వస్తుందని అన్నారు. ఆ తర్వాత తెలుగు హీరోయిన్ అనే ఆలోచన లేకుండా పనిచేయడం మొదలు పెట్టినట్లు సదరు దర్శకుడు తెలిపాడు. అదే ఉత్తరాది వాళ్లు..బెంగుళూరు..చెన్నై మోడల్స్..అమ్మాయిలతో అయితే ఈ రకమైన ఇబ్బంది ఉండదు. దర్శకులకు కావాల్సిన విధంగా అనుగుణంగా ఉంటారు.వాళ్ల అమ్మలు కూడా వెంట ఉంటారు. కానీ పని దగ్గర మాత్రం ఎక్కడా మాలాంటి మేకర్స్ ని ఇబ్బంది పెట్టరు. సెట్ లో పరిస్థితిని అర్ధం చేసుకుని కన్విన్స్ అవుతారు. ఆ విధంగా మనవాళ్లు ఆలోచించలేరు. అక్కడే సమస్య వస్తుంది.లేకుంటే తెలుగు బ్యూటీలకన్నా గొప్ప అందాలు ఇంకెక్కడ దొరుకుతారని నవ్వేసారు. హిందీ వాళ్ల కన్నా కొంత మంది తెలుగు వాళ్లు చాలా వేగంగా పాయింట్ పట్టుకోగలరని..అదే హిందీ వాళ్లతో సెట్ లో బోలెడంత తతగం చేయాల్సి వస్తుందన్నారు. తెలుగు వాళ్లని తీసుకోకపోవడానికి అంతకు మించి నీఘూడ రహస్యాలంటూ ఏమీ లేవని తెలిపారు.




# స్టార్ట్ అయ్యి రెండేళ్లవుతున్నా పూర్తి కాని పవన్ సినిమా!



హరిహర వీరమల్లు.. పవన్ కల్యాణ్ సినీ కెరీర్ లో మొదటి సారిగా చేస్తున్న ఓ పీరియాడిక్ మూవీ ఇది. ఇందులో మొఘలుల కాలం నాటి బందిపోటు దొంగగా పవన్ కల్యాణ్ కనిపించబోతున్నారు. క్రిష్ డైరెక్షన్ లో వస్తున్న ఈ మూవీ రెండు డిఫరెంట్ టైమ్ పీరియడ్స్ లో సాగుతుంది. ఈ సినిమాపై సినీ ప్రేక్షకుల్లో పవన్ కల్యాణ్ అభిమానుల్లో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఎప్పుడెప్పుడు వస్తుందా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు పీకే ఫ్యాన్స్. అయితే షూటింగ్ నెమ్మదిగా సాగుతుండటంతో హరిహర వీరమల్లు ఇప్పట్లో రిలీజ్ అయ్యే సూచనలు కనిపించడం లేదు.హరిహర వీరమల్లు మూవీ అప్పట్లో ఎప్పుడో మొదలైంది. 2020 ఏడాదిలో హరిహర వీరమల్ల షూటింగ్ ప్రారంభమైంది. ఇప్పటికీ సాగుతూనే ఉంది. ఇది 2023 సంవత్సరం ఇంకా షూటింగ్ దశలోనే ఉంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఈ మూవీ నుండి ఎలాంటి అప్డేట్ లేక ఫ్యాన్స్ అసంతృప్తికి లోనవుతున్నారు.దాదాపు ఇంకా 40 శాతానికి పైగా షూటింగ్ బ్యాలెన్స్ ఉందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఇందు రెండు పాటలు కూడా షూట్ చేయాల్సి ఉందని మూవీ టీం చెబుతోంది. పీరియాడిక్ మూవీ కావడంతోనే షూటింగ్ ఆలస్యం అవుతోందని మేకర్స్ చెబుతున్నారు. అయితే మరీ రాజమౌళిలా ఇన్ని సంవత్సరాలు తీసుకోవడంపై ఫ్యాన్స్ అసంతృప్తిగా ఉన్నారు.షూటింగ్ మొత్తం పూర్తయి టాకీ కంప్లీట్ అయితే తప్ప టీజర్ విడుదల చేయరని సినీ వర్గాలు అంటున్నాయి. అయితే ఆలస్యమైనా పర్లేదు కానీ సినిమా అదిరిపోవాలని మాత్రం ఫ్యాన్స్ గట్టిగా చెబుతున్నారు. ఇంత టైం తీసుకుంటున్న మూవీ.. ఔట్ పుట్ కూడా బాగుంటేనే టైం తీసుకున్నదానికి వాల్యూ ఉంటుందని చెబుతున్నారు.ఇక ఈ సినిమాను దసరా నాటికి తప్పకుండా తీసుకొస్తామని మేకర్స్ ధీమాగా ఉన్నారు. మే నెల నాటికి టాకీ పూర్తయిపోతుందని కొంచెం అటు ఇటుగా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ స్టార్టయినా దసరా నాటికి పక్కాగా విడుదలకు రెడీగా ఉంటుందని చెబుతున్నారు. ఇక ఈ సినిమాలో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ కోసం పవన్ కల్యాణ్ మార్షల్ ఆర్ట్స్ లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు.

# వాళ్లిద్దరి వల్లే ఇలా! ఏదేమైనా పుజ్జీ భయపెట్టాడు.. సిరీస్ డ్రా చేసుకుంటాం: స్మిత్

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ-2023లో ఆస్ట్రేలియా తొలి విజయం సాధించింది. ఇండోర్ వేదికగా భారత్తో జరిగిన మూడో టెస్టులో 9 వికెట్ల తేడాతో ఆసీస్ ఘన విజయం సాధించింది.తద్వారా వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్-2023 ఫైనల్కు అర్హత సాధించిన తొలి జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది. కాగా ఆసీస్ రెగ్యూలర్ టెస్టు కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్, రెండో టెస్టు ముగిసిన తర్వాత స్వదేశానికి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.తన తల్లి ఆరోగ్యం కుదటపడకపోవడంతో కమ్మిన్స్ అక్కడే ఉండిపోయాడు. దీంతో మూడో టెస్టుకు స్టీవ్ స్మిత్ సారథ్యం వహించాల్సి వచ్చింది. ఇండోర్ టెస్టులో స్టాండ్ ఇన్ కెప్టెన్గా వ్యవహరించిన స్టీవ్ స్మిత్ తన వ్యహాలతో టీమిండియాను బోల్తా కొట్టించాడు. భారత టాపార్డర్ బ్యాటింగ్ చేస్తున్నంతసేపు ముగ్గురు స్పిన్నర్లతో బౌలింగ్ చేయించి ముప్పు తిప్పలు పెట్టాడు. ఇక మ్యాచ్ అనంతరం విన్నింగ్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ విలేకురల సమావేశంలో మాట్లాడాడు.స్మిత్ మాట్లాడుతూ.. "మేము తొలుత బ్యాటింగ్ చేయాలని అనుకున్నాము. కానీ మేము టాస్ ఓడిపోవడంతో బౌలింగ్ చేయాల్సి వచ్చింది. తొలి రోజు మా బౌలర్లు ఎలా రాణిస్తారో అన్న ఆలోచన నాకు ఉండేది. కానీ మా బౌలర్లు అద్భుతంగా రాణించారు. ముఖ్యంగా కుహ్నేమన్ చాలా బాగా బౌలింగ్ చేశాడు. తొలి రోజు మేము భారత్పై పైయి సాధించాడనికి అదే కారణం. అదే విధంగా మొదటి ఇన్నింగ్స్లో ఉస్మాన్ ఖావాజా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు.ఈ టెస్టులో మా బ్యాటర్లు కీలక భాగస్వామ్యాలు కూడా నెలకొల్పారు. అయితే తొలి ఇన్నింగ్స్లో మేము మరిన్ని పరుగులు చేయాలి అనుకున్నాం. కానీ భారత బౌలర్లు అద్భుతమైన కమ్బ్యాక్ ఇచ్చారు. స్పిన్నర్లు చెలరేగడంతో మేము వెంట వెంటనే వికెట్లు కోల్పోయాం. అదే విధంగా సెకెండ్ ఇన్నింగ్స్లో టీమిండియాను ఆలౌట్ చేయడానికి తీవ్రంగా శ్రమించాం. పుజ్జీ (పూజారా) అసాధారణ ఇన్నింగ్స్తో మమ్మల్ని చాలా ఇబ్బందిపెట్టాడు. అయినప్పటికీ మా బౌలర్లు అతడికి అడ్డుకట్ట వేశారు. లియాన్ కూడా చక్కటి ప్రదర్శన చేశాడు.స్వదేశానికి వెళ్లిన ప్యాట్ కమ్మిన్స్ సలహాలు కూడా మాకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఇక? భారత్లో కెప్టెన్గా వ్యవహరించడం నాకు చాలా ఇష్టం. అదే విధంగా భారత పిచ్లపై టెస్టు క్రికెట్ ఆడటాన్ని ఎంతో గానో ఆస్వాదిస్తాను. ఇక్కడ గెలవడానికి ఏం చేయాలో నాకు బాగా తెలుసు. అహ్మదాబాద్లో కూడా ఫలితాన్ని రిపీట్ చేసి సిరీస్ డ్రా చేయడానికి ప్రయత్నిస్తాం. అక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయో చూడాలి. ఇక చివరగా ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్కు అర్హత సాధించినందుకు చాలా గర్వంగా ఉంది" అని పేర్కొన్నాడు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190